ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ.13.12.24 సమయం.13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకోని వారికి ఇప్పుడు అవకాశం కల్పిస్తున్నట్లు రెవెన్యూ మంత్రి పొంగులేని శ్రీనివాస రెడ్డి తెలిపారు.
2. ఢిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ రోజు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తో సమావేశమై రాష్ట్రానికి సంబంధించిన ఆర్థిక అంశాలపై చర్చించే అవకాశం ఉంది.
3. ఐఐటీ-హైదరాబాద్, వర్ధమాన్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో స్మార్ట్ ఇండియా హ్యాకథాన్-SIH సాఫ్ట్ వేర్ వెర్షన్ కార్యక్రమం నిన్న రాత్రి ముగిసింది. పలు రాష్ట్రాలకు చెందిన విద్యాసంస్థలు వ్యవసాయ, భూ విజ్ఞాన సమస్యలకు పరిష్కారాలు సూచించి బహుమతులు గెలుచుకున్నాయి.
4. రాబోయే మూడు రోజుల్లో పలు జిల్లాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా నమోదవడంతో పాటు ఉదయం వేళల్లో పొగమంచు ఏర్పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

---------------------------

**పొంగులేటి-ఇందిరమ్మ ఇళ్లు**

రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇచ్చే ఇందిరమ్మ ఇళ్ళు ఆదర్శవంతంగా ఉండాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులకు సూచించారు. ఖమ్మం జిల్లా కూసుమంచి మండల తహసిల్దార్ ఆవరణలో ఇందిరమ్మ నమూనా ఇంటి నిర్మాణపు పనులకు మంత్రి ఈ రోజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకోని వారు కూడా ఇప్పుడు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ళ నమూనా ప్రజలంతా చూసే విధంగా కూసుమంచి మండల కేంద్రంలో ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రజలు ఈ నమూనా ఇంటిని పరిశీలించాలని, తమ స్థలాల్లో ఈ నమూనాలో ఇంటి నిర్మాణం ఉండేలా చూడాలన్నారు. ఇందుకోసం మేస్త్రీలకు అవసరమైన శిక్షణ ఇచ్చే విధంగా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

**(PTC, Khammam)**

--------------------------------------

**సీఎం-ఢిల్లీ పర్యటన**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటన రెండో రోజు ఈ రోజు కొనసాగుతోంది. నేడు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తో సమావేశం కానున్నారు. ఈ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి నిన్న సాయంత్రం ముగ్గురు కేంద్ర మంత్రులతో సమావేశమై రాష్ట్రానికి సంబంధించిన పలు ప్రాజెక్టులు, అంశాలపై చర్చలు జరిపారు. రాష్ట్రానికి సంబంధించిన పలు పెండింగ్ ప్రాజెక్టుల వివరాలను కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి కిషన్‌రెడ్డికి అందించారు. ఈ సందర్భంగా మొత్తం 1.63 లక్షల కోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టుల విషయంలో కేంద్రం

నుంచి సహకారం అందించాలని కోరారు. ఆర్ఆర్ఆర్ నిర్మిస్తామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 2022లోనే ప్రకటించిన విషయాన్ని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. తెలంగాణకు కేంద్రీయ విద్యాలయాలు కేటాయించాలని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్కి విజ్ఞప్తి చేశారు. ఇటీవల రాష్ట్రానికి ఏడు నవోదయ విద్యాలయాలు కేటాయించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అదే సమయంలో రాష్ట్రానికి ఒక్క కేంద్రీయ విద్యాలయం కూడా కేటాయించలేదని, కేంద్రియ విద్యాలయాలతో పాటు నవోదయ పాఠశాలలు లేని జిల్లాలకు వాటిని కేటాయించాలని ముఖ్యమంత్రి కోరారు. ఇక, రీజినల్ రింగు రోడ్డు ఉత్తర భాగానికి అవసరమైన సాంకేతిక, ఆర్థికపరమైన అనుమతులు వెంటనే ఇవ్వాలని కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరిని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రానికి సంబంధించి పలు జాతీయ రహదారులు, ఇతర రహదారుల వివరాలను తెలియజేసి సత్వరం అనుమతులు మంజూరు చేయాలని కోరారు.

(డెస్క్)

-------------------------------------

**శ్రీధర్ బాబు-సదస్సు**

క్రుత్రిమ మేధస్సు-ఏఐ సాఫ్ట్ వేర్ ను ఒక సేవగా అందించే ప్రపంచ ప్రసిద్ధి సంస్థ ఫెనామ్ IAMPHENOM INDIA- 2024 మొట్టమొదటి ఇంటెలిజెంట్ టాలెంట్ ఎక్స్ పీరియన్స్ సదస్సు హైదరాబాద్ హైటెక్ సిటీలో నిర్వహిస్తోంది. ఈ రోజు ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ AI ఆటోమేషన్ అభివృద్ధి పై వివరించారు. AI తో ప్రస్తుతం భవిష్యత్తు లో కలిగే ప్రయోజనాల గురించి

తెలియచేశారు. ఈ కాన్ఫరెన్స్ లో మంత్రి తో పాటు, ఫెనామ్ సీఈఓ, వ్యవస్థాపకులు బాయిరెడ్డి, సుమారు 500 మందికి పైగా సీనియర్ HR లు పాల్గొన్నారు.

**(HYD -PTC)**

------------------------------

**Telangana -SIH winners:**

ఐఐటీ-హైదరాబాద్‌లో నిన్న రాత్రి ముగిసిన స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ -SIH సాఫ్ట్ వేర్ వెర్షన్ వ్యవసాయ సమస్యల పరిష్కార విభాగంలో ముంబైకి చెందిన వెలింగ్కర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్, గ్రేటర్ నోయిడాకు చెందిన నోయిడా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, నాగ్‌పూర్ లోని యశ్వంత్ రావ్ చవాన్ ఇంజినీరింగ్, కోల్‌కతా కు చెందిన టెక్నో మెయిన్ సాల్ట్ లేక్ సంస్థలు బహుమతులు గెలుచుకున్నాయి. అదేవిధంగా హైదరాబాద్‌లోని వర్ధమాన్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో జరిగిన SIH సాఫ్ట్ వేర్ వెర్షన్‌లో చమురు చిందటాలను ఆటోమేటిక్ గా గుర్తించడానికి తమ పరిష్కారానికి గాను నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ-సిల్చార్ గెలిచింది. వినోదం కోసం బీచ్‌ల అనుకూలతను అంచనా వేయడానికి పరిష్కారానికి గాను నాగ్‌పూర్ ట్రిపుల్ ఐటీ కూడా బహుమతిగెలిచింది.

నవీ ముంబైకి చెందిన దత్తా మేఘే కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, గ్వాలియర్ కు చెందిన ట్రిపుల్ ఐటీ-మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్, కాన్పూర్ లోని చత్రపతి సాహుజీ మహారాజ్ విశ్వవిద్యాలయం, పూణె ట్రిపుల్ ఐటీ భూ శాస్త్రానికి సంబంధించిన ఇతర సమస్యల పరిష్కారాల్లో బహుమతులు పొందాయి. వర్ధమాన్ కళాశాల SIH

నోడల్ కేంద్రంలో AICTE నియమించిన ఉపాధ్యక్షుడు డాక్టర్ యోగేష్ టొపాలె మాట్లాడుతూ హ్యాకథాన్‌లో పాల్గొన్న విద్యార్థులు సమస్యలకు అవసరమైన పరిష్కారాలకు దగ్గరగా సరిపోలే నమూనాలను రూపొందించారని అన్నారు.

**(సౌండ్ బైట్ - డాక్టర్ యోగేష్ టొపాలె)**

**(డెస్క్)**

-------------------------

**నిజాం సాగర్-మంత్రి ఉత్తమ్ రెడ్డి**

రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ రోజు కామారెడ్డి జిల్లాలో పర్యటిస్తున్నారు. కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ ప్రాజెక్ట్ వద్ద ఈ ఉదయం పూజలు చేసి నీటిని విడుదల చేశారు. ప్రాజెక్టును సందర్శించి అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బాన్సువాడ, బోధన్, జుక్కల్ శాసన సభ్యులు పోచారం శ్రీనివాస్ రెడ్డి సుదర్శన్ రెడ్డి, తోట లక్ష్మీకాంతారావు, కామారెడ్డి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తదితరులు పాల్గొన్నారు.

**(పిటిసి, రాజన్న సిరిసిల్ల)**

-----------------------------

**కొత్తగూడెం**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం అల్లిపల్లి గ్రామం లో సి సి రోడ్ నిర్మాణ పనులకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ రోజు శంకుస్థాపన చేశారు. అనంతరం కొత్తగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనం, పాఠశాల భవనాలను ప్రారంభించారు.

**(పీటీసీ ఖమ్మం)**

--------------------------------

**న్యూ ఇయర్ -నిబంధనలు**

కొత్త ఏడాది వేడుకలపై హైదరాబాద్ పరిధిలో పోలీసులు పలు నిబంధనలు విధించారు. హోటళ్లు, పబ్బులు, రెస్టారంట్లు, ఈవెంట్ల నిర్వాహకులు పాటించాల్సిన నిబంధనలను హైదరాబాద్ నగర కమిషనర్ సీవీ ఆనంద్ వెల్లడించారు. రాత్రి ఒంటి గంట వరకు వేడుకలు నిర్వహించే వారికి అనుమతి తప్పనిసరి అని, నిర్వాహకులు 15 రోజులు ముందుగానే అనుమతి తీసుకోవాలని తెలిపారు. వేడుకలు నిర్వహించే ప్రదేశాల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఉండాలన్నారు. వేడుకల్లో అశ్లీల నృత్యాలపై, బహిరంగ ప్రదేశాల్లో రాత్రి 10 తర్వాత లౌడ్ స్పీకర్ల వాడకం నిషేధం ఉంటుందన్నారు. బార్లు, పబ్బుల్లో మైనర్లకు అనుమతి లేదన్నారు. వేడుకల్లో  డ్రగ్స్ వినియోగిస్తే కఠిన చర్యలుంటాయని, నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మద్యం సేవించి వాహనం నడిపితే 10 వేల రూపాయల జరిమానా, 6 నెలలు జైలు శిక్ష ఉంటుందని హెచ్చరించారు.

**(పీఎస్)**

------------------------

**భూదాస్-ఈడీ**

భూదాన్ భూముల కుంభకోణం కేసులో బీఆర్ఎస్ నేత, నాగర్‌కర్నూలు మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి, వంశీరాం బిల్డర్స్ సుబ్బారెడ్డితో పాటు మరో ఇద్దరికి ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్- ఈడీ నోటీసులు జారీ చేసింది. ఈ నెల 16వ తేదీన విచారణకు హాజరుకావాలని ఈడీ నోటీసులో పేర్కొంది.

**(డెస్క్)**

----------------------------

**సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె-ఆదిలాబాద్**

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె ఆసిఫాబాద్ జిల్లాలో కొనసాగుతోంది. సమ్మెలో భాగంగా జిల్లా కలెక్టరేట్ ఎదుట చేస్తున్న నిరసన దీక్షలో ఉద్యోగులు ఈ రోజు ఖాళీ టీ కప్పులతో తమ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షురాలు శృతిక మాట్లాడుతూ సమ్మె ప్రారంభమై మూడు రోజులైనప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. పెన్ డౌన్ చేసిన నేపథ్యంలో కేజీబీవీ, అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యాబోధన పూర్తిగా ఆగిపోయిందన్నారు. సమ్మెకు అన్ని వర్గాలు మద్దతు ఇవ్వాలని కోరారు.

**(ఆసిఫాబాద్ జిల్లా పిటిసి)**

----------------------

**మంచిర్యాల-కలెక్టర్**

మంచిర్యాల జిల్లా జిల్లాలో ఈ నెల 15, 16 తేదీలలో జరిగే గ్రూప్-2 పరీక్షను సమర్ధవంతంగా నిర్వహించేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో పరీక్ష నిర్వహణ కోసం 48 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని, 14 వేల 951 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నారని తెలిపారు..

**(పిటిసి, మంచిర్యాల జిల్లా)**

---------------------

**గ్రూప్-2 మహబూబాబాద్**

మహబూబాబాద్ జిల్లా పరిధిలో ఈ నెల 15, 16వ తేదీలలో జరిగే TGPSC గ్రూప్ 2 పరీక్షల నేపథ్యంలో ఆయా పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్ తెలిపారు.

**(మహబూబాబాద్ జిల్లా,పి.టి.సి)**

---------------------------

**వాతావరణం-చలి**

రాబోయే మూడు రోజుల్లో పలు జిల్లాల్లో అక్కడక్కడ ఉదయం వేళల్లో పొగమంచు ఏర్పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. అలాగే, కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. ఆదిలాబాద్, కొమరం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్ జిల్లాల్లో శీతల గాలులు అక్కడక్కడ వీచే అవకాశం ఉందని పసుపు హెచ్చరిక జారీ చేసింది. ఆదిలాబాద్ జిల్లా బేల మండల కేంద్రంలో నిన్న రాష్ట్రంలోనే కనిష్టంగా 7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

**(డెస్క్)**

--------------------

**దుండిగల్-సీఏఎస్**

హైదరాబాద్ దుండిగల్ లోని ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో రేపు జరిగే 214వ కోర్సుకు సంబంధించిన కంబైన్డ్ గ్రాడ్యుయేషన్ పరేడ్ లో గ్రాడ్యుయేటింగ్ ట్రైనీలకు చీఫ్ ఆఫ్ ఎయిర్ స్టాఫ్ -CAS ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ 'ప్రెసిడెంట్ కమిషన్'ను అందజేస్తారు. భారత వైమానిక దళం –IAF కొత్త పైలట్లకు శిక్షణను విజయవంతంగా పూర్తి చేసినందుకు వేడుకను నిర్వహించనుంది.

**(MSL)**

-----------------------------

**సిరిసిల్ల-వైద్యాధికారి**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో  అర్హులైన ప్రతి ఒక్కరికి ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ - అబా కార్డులు అందిస్తామని జిల్లా వైద్యాధికారి డాక్టర్ వసంతరావు తెలిపారు. జిల్లాలో 16 నుంచి 59 సంవత్సరాల వయసున్న వారి ఆరోగ్య వివరాలను సేకరించి  ఆన్ లైన్ లో నమోదు పై వైద్యాధికారులకు, స్టాఫ్ నర్సులకు  దేశ నిర్దేశం చేశారు. అరులైన ప్రతి ఒక్కరికి  ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ అబా కార్డులు అందించాలని సూచించారు.

**(పి టి సి, రాజన్న సిరిసిల్ల జిల్లా)**

------------------------------